క్లుప్తంగా

శివాలయం పునఃనిర్మాణ పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

కాశీబుగ్గ: పలాస మండలం నీలిబద్ర గ్రామంలో వెలసియున్న స్వయంభూ లింగం వద్ద శివాలయ పునః నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. గతంలో నిర్మాణం జరిగి మధ్యలో నిలిచిపోగా గ్రామస్తులు, దాతలు సహకారంతో తిరిగి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా శాంతి హోమం నిర్వహించారు.

జేవీవీ పోస్టర్ అవిష్కరణ



పోస్టర్ అవిష్కరిస్తున్న ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు

సంతబొమ్మాళి: జనవిజ్ఞాన వేదిక సైన్స్ ఎక్స్‌పో 2025 పేరుతో సైన్స్ ప్రయోగాల వీడియో పోటీల పోస్టర్‌ను శనివారం అవిష్కరించారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులతో సృజనాత్మకత, సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించేందుకు సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ సుస్థిర అభివృద్ధి, మూఢనమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై వీడియో ప్రయోగ పోటీలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు జలుమూరు చిన్నవాడు, అర్జునుడు, ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు, కె.చైతన్య, రెడ్డి సూరిబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను సంరక్షించుకోవాలి



అవగాహన ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పలాస: చిత్తడి నేలలు ఎక్కడ ఉన్నా వాటిని పరిరక్షించుకోవాలని.. అవి పర్యావరణ హితమైనవని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణ రావు చెప్పారు. శనివారం చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జాతీయ హరితదళ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అదే అంశంపై చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. హరిత క్లబ్ క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పంచాయతీ కార్యాలయంలోకి సచివాలయం మార్పు




సాక్షి ఎఫెక్ట్..

పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ సచివాలయం–2ను స్థానికంగా ఉన్న పాత పంచాయతీ కార్యాలయం భవనంలోకి మార్పు చేశారు. ఇప్పటి వరకూ శిథిలమైన తుఫాన్ షెల్టర్లో సచివాలయం కొనసాగేది. దీనిపై ‘తుఫాన్ షెల్టరే సచివాలయం’ శీర్షికతో శనివారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీనికి ఎంపీడీవో జయంతి ప్రసాద్ స్పందించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు శిథిల తుఫాన్ షెల్టర్‌లో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర రికార్డులను పాత గ్రామ పంచాయతీ కార్యాలయం భవనంలోకి పంచాయతీ కార్యదర్శి యు.ఉమాపతి తరలించారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆదేశాల మేరకు నౌపడ వైఎస్సార్ కాలనీలో ఆక్రమణలను శనివారం రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారు. జేసీబీతో తుప్పలన్నిటిని తొలగించి చదును చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేసి, ఎవరు ఆక్రమణలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో మంగులు పంచాయతీ కార్యదర్శి ఉమాపతి ఉన్నారు.

కానరాని భద్రత!

- బాలికల వసతి గృహాలపై ‘నిఘా’శూన్యం
- కనీసం సీసీ కెమెరాలు సైతం లేని వైనం



సీసీ కెమెరా వ్యవస్థ లేని టెక్కలి సాంఘిక, వెనుకబడిన తరగతుల శాఖ కళాశాల బాలికల వసతి గృహం

టెక్కలి: బాలికల వసతి గృహాల్లో భద్రత విషయంలో నిఘా కొరవడింది. కొన్ని వసతి గృహాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు.. మరికొన్ని వసతి గృహాల్లో వార్డెన్లు సక్రమంగా పర్యవేక్షణ లేకపోవడం, పిల్లలకు అందుబాటులో లేకపోవడంతో నిషేధ సమయాల్లో సైతం ఆయా బాలికలు బయటకు వెళ్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా జిల్లా కేంద్రంలోని ఓ వసతి గృహంలో జరిగిన సంఘటనతో బాలికల వసతి గృహాల్లో నిఘా వ్యవస్థపై ఆందోళన చోటు చేసుకుంటోంది.

నిఘా నేత్రాలు ఎక్కడ?

టెక్కలి మండలంలో సాంఘిక, వెనుకబడిన తరగతులకు సంబంధించి ఐదు పోస్టుమెట్రిక్, మేనేజ్‌మెంట్ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా ఒకే భవనంలో ఉన్నటువంటి సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు చెందిన కళాశాల బాలికల వసతి గృహంలో 314 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ ఇంటర్ నుంచి డిగ్రీ, బీటెక్ ఆ పై తరగతుల విద్యార్థినులు ఉంటున్నారు. చీకటి పడితే నిర్మానుష్యంగా ఉండే ఈ వసతి గృహానికి సీసీ కెమెరాల పర్యవేక్షణ లేదు. అంతే కాకుండా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం వార్డెన్ అందుబాటులో ఉండరనే విమర్శలు ఉన్నాయి. అలాగే ఎస్టీ మేనేజ్‌మెంట్ బాలికల వసతి గృహ శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. నందిగాం మండలంలో మారుమూల కొండల ప్రాంతంలో మధనాపురం కేజీబీవీ వసతి గృహంలో 276 మంది వరకు ఆరు నుంచి ఇంటర్ విద్యార్థినులు ఉన్నారు. మారుమూల కొండల ప్రాంతంలో ఉన్నప్పటికీ ఇక్కడ కూడా పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి కేజీబీవీ వసతి గృహాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. నియోజకవర్గంలో కొన్ని వసతి గృహాల్లో రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండరనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాలికల వసతి గృహాలపై నిఘా వ్యవస్థ మరింత పటిష్టం చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై నివేదించాం



బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో పోలీసుల గస్తీ చేపట్టాలని స్థానిక పోలీసులకు విన్నవించాం. బాలికల వసతి గృహాల్లో భద్రత విషయమై వార్డెన్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం.

–పి.చాముండేశ్వర్రావు, బీసీ వెల్ఫేర్ అధికారి, టెక్కలి



టెక్కలి సాంఘిక, వెనుకబడిన తరగతుల శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో సంచరిస్తున్న కుక్కలు



నందిగాం మండలం మధనాపురంలో సీసీ కెమెరా వ్యవస్థ లేని కేజీబీవీ

ఫీజు పోరుకు తరలిరండి

- విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్ పిలుపు
- టెక్కలి పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ



ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థులను సైతం మోసం చేశారన్నారు. విద్యార్థుల తరఫున కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఫీజు పోరు నిరసన కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ నెల ఐదో తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను టెక్కలి పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు తల్లికి వందనం పథకం ఊసే లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా మంగళం పాడేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో సాంకేతిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆయా యాజమాన్యాలు నోటీసులు జారీ చేయడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. విద్యార్థులకు అందాల్సిన పూర్తిస్థాయి రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసే విధంగా పెద్ద ఎత్తున చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, నాయకులు జి.వి.రెడ్డి మాస్టార్, వి.శ్రీధర్‌రెడ్డి, ఎన్.సాబతో, ఎన్.గణపతిరావు, చిన్ని జోగారావు, ఆర్.లక్ష్మీకాంతం, ఎస్.హేమసుందర్‌రాజు, ఎం.సంజీవరావు, యు.తమ్మయ్య, డి.ధర్మారావు, కె.జీవన్, హెచ్.లక్ష్మణ్, ఎ.రాహుల్, పి.మోహన్‌రావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సైనికుల్లా పనిచేస్తాం

- వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సైనికుల్లా పనిచేస్తాం...



అనుబంధ విభాగాల అధ్యక్షులను సన్మానిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సైనికుల్లా పని చేస్తామని వివిధ విభాగాలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ప్రతిజ్ఞ చేశారు. శనివారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అనుబంధ విభాగాల అధ్యక్షులను నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సన్మానించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలకు అండగా ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి భాగస్వామ్యం కావాలని కోరారు. వివిధ విభాగాల్లో నియోజకవర్గ స్థాయిలో అధ్యక్షులుగా నియామకమైన ప్రతీ ఒక్కరూ వారి పరిధిలో ప్రజలకు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు జరిగే ప్రతీ అన్యాయాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా అక్రమాలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు అవసరమైన ఆందోళన కార్యక్రమాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావుతో పాటు పార్టీ నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులు చిన్ని జోగారావు, గొండు చాందిని, రేగల లక్ష్మీకాంతం, జి.వి.రెడ్డి మాస్టారు, బి.దివాకర్, కర్నిక జీవన్‌రావు, వాకాడ శ్రీధర్‌రెడ్డి, బి.తిరుపతిరావు, నర్సింగ్ నాథ్ సాబతో, ఎ.రాహుల్, ఎన్.నరేష్, బి.మోహన్, పోలాకి మోహన్‌రావు, డి. ధర్మారావు, ఎస్.జనార్దన్‌రావు, యు.తమ్మయ్య, మొర్రి శంకర్, ఎల్.బాలకృష్ణ, పి.కరుణాకర్, హెచ్.లక్ష్మణ్‌రావు, జి.చంద్రశేఖర్, అంగ మల్లేష్, సింగుపురం వినోద్, నాయకులు కె.బాలకృష్ణారావు, ఎన్.గణపతిరావు, ఎస్.హేమసుందర్‌రాజు పాల్గొన్నారు.

నారాయణ సేవలో విద్యార్థులు

పలాస: పలాస మండలం రామక్రిష్ణాపురం వద్ద గల శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు నారాయణ సేవలో శనివారం పాల్గొన్నారు. నెలంతా తెచ్చుకున్న పాకెట్ మనీ నుంచి సేకరించిన డబ్బులతో నిరుపేదలకు, బిక్షగాళ్లకు అన్న ప్రసాదాలను అందజేశారు. ప్రతి ఒక్కరు తమ రోజు వారీ ఖర్చులను తగ్గించుకొని కొంత సొమ్మును మిగుల్చుకొని ఒక చోట జమ చేస్తారు. ఆ విధంగా పాఠశాలలోని మొత్తం విద్యార్థుల సొమ్ముతో ప్రతి నెల ఒకటో తారీఖున పేదలకు ఏదో రకంగా సహకరిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే పలాస రైల్వే స్టేషన్ వద్ద ఉన్న భిక్షగాళ్లు, నిరుపేదలకు అన్నప్రసాదాలను అందజేశారు.

పాఠశాల విలీనం వద్దని విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న లొట్టిపుట్టుగ గ్రామస్తులు

కవిటి: తమ గ్రామంలోని పాఠశాలను వేరే గ్రామంలోని పాఠశాలలో విలీనం చేయవద్దని లొట్టిపుట్టుగ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం కవిటి ఎమ్మార్సీ కార్యాలయంలో తమ అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. తన గ్రామ పాఠశాలను బిగొనవపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కోడిగుడ్ల లారీ బోల్తా

టెక్కలి రూరల్: కోడిగుడ్లను తీసుకొని వెళ్తున్న లారీ లచ్చన్నపేట గ్రామ సమీపంలో శనివారం వేకువ జామున జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువలో బోల్తాపడింది. విజయవాడ నుంచి పశ్చిమబెంగాల్ వైపు వెళ్తున్న లారీ లచ్చన్నపేట గ్రామ సమీప మలుపువద్ద అదుపుతప్పడంతో పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. అయితే లారీలో ఉన్న గుడ్లు చాలా వరకు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

డ్రైవింగ్‌పై అవగాహన



అవగాహన లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై రవాణా, పోలీస్ శాఖ సంయుక్తంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఎంవీఐ మాట్లాడుతూ.. అవగాహన లేకుండా అతి వేగంతో వాహనాలు నడుపుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవగాహన కలిగిన డ్రైవింగ్ చేయడం వలన ఎంతో సురక్షితమని హితవు పలికారు. ఎస్‌ఐ కె.రాము, వైద్యుడు లక్ష్మణరావు, డీటీ అనిల్‌కుమార్, అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు ల్యాక్‌పాల్, డి.వాసుబాబు, గొల్ల ఉన్నారు.

–టెక్కలి

కేటీరోడ్డులో దారేదీ?



ప్రతీ శుక్రవారం సంతతో పాటు ఇతర రోజుల్లో కాశీబుగ్గ బస్టాండ్ ఎదురుగా కేటీ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందికరంగా మారుతుంది. అమ్మకం దారులు, కొనుగోలు దారులతో రద్దీగా ఈ ప్రాంతం ఉంటుంది. అయితే ఇక్కడ ఆటోలను రోడ్డుపై నిలిపేస్తున్నారు. దీంతో పలాస నుంచి కాశీబుగ్గ వచ్చే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు సిబ్బంది దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

సామాజిక తనిఖీ..



ఇచ్ఛాపురం మండలంలోని అన్ని పంచాయతీల్లో నిర్వహించబోయే సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా విజిలెన్స్ అధికారి స్వరూపారాణి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ బృందం, ఉపాధిహామీ సిబ్బందితో సోమారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీరాజ్, ఉపాధిహామీ, గృహ నిర్మాణంపై సోషల్ ఆడిట్ బృందం గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులను నేరుగా కలుస్తారని.. అందరూ సహకరించాలని అన్నారు. ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఎం.తిరుపతి, ఎంపీడీవో కె.రామారావు, ఏపీవో పి.శ్రీనివాసరావు ఉన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

కుంకుమ పూజలు..



సంతబొమ్మాళి మండలం నౌపడలో భూలోకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన శనివారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలను నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అంతకుముందు హోమం కాల్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దల్లి రాజు దంపతులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

మేట్ల తొలగింపు తగదు



ఏపీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: కొన్ని సంవత్సరాలుగా మేట్‌లుగా పనిచేస్తున్న వారిని తొలగించి కొత్తవారిని నియమించడం తగదని ఎంపీపీ బోర పుష్ప, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియను నిలిపి వేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసరావురెడ్డికి ఎంపీడీఓ కార్యాలయంలో వినతపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్‌లను తొలగించి, కూటమి నేతలు తమకు అనుకూలమైన వ్యక్తులను నియమిస్తున్నారని అన్నారు. పాత మేట్‌లు ఇప్పటికే పని డిమాండ్ ఇవ్వడం, మస్టర్లు వేయడం వంటి వాటిపై శిక్షణ పొందారని, వారిని కాదని కొత్త వారిని నియమించడం కక్ష పూరితమేనని అన్నారు. నిబంధనల ప్రకారం కొత్త వారిని నియమించే ముందు వేతనదారుల అభిప్రాయాలు, గ్రామ సభల తీర్మానం ద్వారా నియమించాలని కోరారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

కంచిలి: మండలంలో శనివారం జరిగిన సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీవో వి.తిరుమలరావు పరిశీలించారు. అంపురం, మఠం సరియాపల్లి, కొల్లూరు, నారాయణబట్టి, రేఖాదేవిపురం, ముండ్ల, సవరగోవిందపురం, జె.జిల్లుండ గ్రామాల్లో పర్యటించి తనిఖీ చేశారు. ఈ నెల నుంచి పెన్షన్‌దారుల ఇళ్ల జియో కోర్డినెట్స్ (అక్షంశాలు, రేఖాంశాలు) సరిపోతేనే పింఛన్ అందజేస్తామన్నారు. దీనిని జీవనోపాధిపై ఇతర ప్రాంతాల్లో నివసిస్తూ ప్రతీ నెల సొంత ఇళ్లలో పెన్షన్ పొందుతున్న వారు గమనించాలన్నారు. దీనివలన కాస్త నెమ్మదిగా పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అక్రమ మద్యం అమ్మకాలపై ‘14405’కు ఫిర్యాదు చేయండి

వజ్రపుకొత్తూరు రూరల్: సారా, అక్రమ మద్యం అమ్మకాలతో పాటు మాదకద్రవ్యాల తరలింపు చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టినా, సారా ఇతర ఎక్సైజ్ నేరాలకు ఎవరైనా పాల్పడితే టోల్ ఫ్రీ నంబర్ 14405 నంబర్‌కు తెలియజేయాలని శనివారం కోరారు.

నేడు చిత్తడి నేలల దినోత్సవం

సోంపేట: సోంపేట పట్టణంలో ఆదివారం నిర్వహిస్తున్న చిత్తడి నేలల దినోత్సవాన్ని పర్యావరణ ప్రేమికులు విజయవంతం చేయాలని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి శనివారం కోరారు. సోంపేట కలాసీ సంఘ భవనంలో ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఉద్యమకారులు, అన్ని సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీ ఉపాధ్యాయుడుకి సత్కారం

కవిటి: ఆర్‌బల్లిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో పదేళ్ల పాటు సుదీర్ఘసేవలందించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్‌జీటీ పత్రి సాయిరాజ్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది సత్కరించారు. ఎంఈవో ధనంయమజ్జి, సీనియర్ ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, మొర్రి గోపి, బల్ల ధర్మారావు, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వసతులు కల్పిస్తాం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి గ్రంథాలయానికి అన్ని మౌలిక వసతులు కల్పించి పూర్వ వైభవం తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజ్ అన్నారు. గ్రంథాలయాన్ని శనివారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఇక్కడ పనిచేసిన లైబ్రేరియన్ మృతి చెందడంతో ఆ స్థానంలో సంతబొమ్మాళి గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణను నియమించామన్నారు.

భక్తి శ్రద్ధలతో జలయాత్ర



జలయాత్ర చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: సత్ సనాతన ధర్మ ఉదాస్ గురు అష్ట ప్రహరీ నామ యజ్ఞం సందర్భంగా ఈదుపురం కంద్రా సామాజిక వర్గానికి చెందిన ప్రజలు భక్తి శ్రద్ధలతో జలయాత్ర చేపట్టారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు నిర్వహించే యజ్ఞంలో భాగంగా శనివారం హరేరామ–హరేకృష్ణ నామ సంకీర్తనలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్థానిక బహుదానదిలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలతో జలాన్ని ఊరేగింపుగా యజ్ఞశాలకు తీసుకు వచ్చి పూజలు చేశారు.

ప్రాజెక్టు నిబంధనల ప్రకారం రుణాలివ్వాలి

కంచిలి: ప్రాజెక్టు నిబంధనలను అనుసరించి అర్హత కలిగిన సంఘాలకే బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, సీఐఎఫ్ రుణాలకు సిఫారసు చేయాలని ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్యలో సిబ్బందితో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. సెర్ప్ సీసీలు రాణి, పాపారావు, ప్రమీల, ధనలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై నిరసన రేపు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణం, మండలం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే ఎల్‌సీగేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, లేదా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల మూడో తేదీన నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

టెక్కలి: యూటీఎఫ్ బలపరచిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీని గెలిపించాలని కోరుతూ సంఘ నాయకులు మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం ప్రచారం చేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు కె.దాలయ్య, టి.వైకుంఠరావు, పి.ధర్మారావు పాల్గొన్నారు.

‘సూర్యఘర్ యోజన’పై అవగాహన

వజ్రపుకొత్తూరు: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. తోటపల్లి గ్రామంలో గ్రామైక్య సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించి సూర్యఘర్ పథకంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ పథకం వల్ల గృహ విద్యుత్ వినియోగదారులకు తక్కువ బిల్లు వస్తుందన్నారు. సీసీ హరిప్రియ, వీఓఏ హేమలత, ఆడిట్ సీఆర్‌పీలు ఉన్నారు.

ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ల ప్రక్రియ నమోదు

టెక్కలి: కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన విశ్రాంత ఉద్యోగులకు టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో లైఫ్ సర్టిఫికెట్ నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రతినిధులు ఆర్.రామచంద్రరావు, కె.ధనుంజయరావు వెల్లడించారు. ఇటువంటి సేవలు ఉచితంగా అందజేస్తున్నామని అవసరమైన వారు 94402 81712 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ

సోంపేట: మండలంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు పార్టీ నేతలతో కలిసి శనివారం పరామర్శించారు. తాళభద్రలో ఉగ్రపల్లి చిన్నయ్య చనిపోవడంతో ఆయన కుటుంబాన్ని, రాణిగాంలో కె.నూకయ్య మృతి చెందడంతో అతని కుటుంబాన్ని, బారువలో హరీష్ పాణిగ్రాహి కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తడక జోగారావు, ఇప్పిలి క్రిష్ణారావు, డి.మాధవరావు, టి.ధర్మారావు ఉన్నారు.

బ్యాంక్ మేనేజర్ నిలదీత

సంతబొమ్మాళి: నౌపడ స్టేట్ బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం ఉద్రిక్తత ఏర్పడిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. బ్యాంక్ మేనేజర్ క్యాబిన్‌లో గొడవ జరగడంతో ఖాతాదారులు, సిబ్బంది గందరగోళానికి గురయ్యారు. సెల్‌ఫోన్‌లో తన భార్యతో ఎందుకు చాటింగ్ చేస్తున్నావంటూ వెలుగు సీఎఫ్ భర్త, ఆమె కుమార్తె నిలదీయడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఇంతలో పోలీస్ కానిస్టేబుల్ రాజు బ్యాంకుకు చేరుకుని విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని చెప్పి సీఎఫ్ కుటుంబసభ్యులను బయటకు పంపించారు.

ఒడియా మాధ్యమాన్ని కొనసాగించాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా మాధ్యమాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఒడియా మైనారిటీ లింగ్విస్టిక్ అధ్యక్షులు సత్యన్నారాయణ పాఢీ కోరారు. ఇటీవల తీసుకొచ్చిన జీవో ప్రాప్తికి ప్రభుత్వం విలీనం చేయనున్న పాఠశాలల వల్ల ఒడియా విద్యార్థులకు జరగబోవు అన్యాయంపై శనివారం పట్టణంలోని ఒడియా లైబ్రరీలో ఒడియా లింగ్విస్టిక్ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాపరమైన ఒప్పందాలను కుదుర్చుకున్నాయని, ఆ ఒప్పందాలను అనుసరించి రాష్ట్రంలో ఒడియా మాధ్యమాన్ని కొనసాగించి విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలన్నారు. రాష్ట్ర ఒడియా గౌర సంఘం అధ్యక్షులు, ఒడియా మైనారిటీ సంఘం ప్రతినిధులు రఘునాథగౌడ, శివప్రసాద్‌పండా, రాజేంద్రపండా విద్యాధరబెహర పాల్గొన్నారు.

పుస్తక నిర్వహణ పరిశీలన

కాశీబుగ్గ: మందస మండలం సిద్దిగాం గ్రామ సంఘంలో స్వయం సహాయక సంఘ సభ్యులు నిర్వహిస్తున్న పుస్తకాలను వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు శనివారం పరిశీలించారు.

వైద్యానికి ఆర్థిక సాయం

టెక్కలి: సారవకోట మండలం కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన బాలుడు కిల్లి ధనుష్ వైద్యానికి యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్ తనవంతు సాయంగా ఐదు వేల రూపాయలను ప్రకటించారు. ఈ మొత్తాన్ని బాలుడి తల్లిదండ్రులకు శనివారం అందజేశారు.